


# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

మంగళవారం | 21 | ఫిబ్రవరి | 2023 | పేజీలు : 8


# పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి

## విజయం సాధించేవరకు విశ్రమించవద్దు

### మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సాధనే ల్యోంగా గులాబీ జెండాను ఎత్తి పార్టీ గెలుపే లక్ష్యంగా ,ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు నిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో రామగుండం నియోజకవర్గ బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, ఇంచార్జీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మంత్రి మాట్లాడారు. ఆలసత్వం అవాస్తవాలు, అబద్దాలు రాజ్యమేలుతాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ప్రతి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఒక సుక్షతుడైన సైనికుడిలా పనిచేయాలన్నారు. దేశంలో ఒప్పటి వరకు బీజేపీ 8ఏళ్ల పాలనంత దరిద్రమైన పాలన చరిత్రలోనే లేదన్నారు. గత పదేళ్ల కాంగ్రెస్ పాలన, నేటి బీజేపీ పాలనలపై చర్చపెట్టి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను కార్యకర్తలు చెడుగుడు ఆడాలన్నారు. రామగుండం నియోజకవర్గంలోని 259పోలింగ్ బూతుల్లో బూత్ ఇంచార్జీల నియామకం






చేసుకొని, తొలుతగా బూత్ కమిటీలను నిర్మించుకోవడం శుభసూచకమన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరు వరకు పనిచేద్దామన్నారు. లక్ష్యసాధనలో నిరంతరం పార్టీ కోసం అకర్నిషలు శ్రమించాలని సూచించారు.

**కుట్రలు,కుతంత్రాలు తిప్పి కొట్టాలి**

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంల వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయాలని, ఎంతమంది ఎన్నికుట్రలు, కుతంత్రాలు పన్నినా వాటిని తిప్పికొట్టి విన్నింగ్ టీంగా ముందుండి పనిచేయాలని రామగుండం ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రామగుండం నియోజకవర్గంలో 2లక్షల40వేల మంది ఓటర్లున్నారని, ప్రతి వెయ్యి మందికి ఒకరా చొప్పున 259మందిని నియమించుకొని తర్వాత ఆప్రాంత సర్పంచ్, ఎంపీటీసీ, కార్పొరేటర్, కౌన్సిలర్లతో కలిసి పార్టీ పటిష్టానికి కృషి చేయాలన్నారు.

**అనవసర విషయాలను పక్కనపెట్టాలి**

**జడ్పీచైర్మన్ పుట్ట మధూకర్**

ఎన్నికలు వస్తున్నాయని ఎవ్వరూ ఆగమాగం కావద్దని, అనవసర విషయాలను ప్రక్కన పెట్టి టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన విజయాలను, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమంపైనే చర్చించాలన్నారు. పార్టీలోనే చిన్న చిన్న విషయాలను పెద్దగా పట్టించుకొని, వాటిపైనే ఆలోచించి సమయాన్ని వృథా చేయవద్దని, మన కోసం పార్టీ చేసిన, రామగుండం ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో అంతర్గాం జడ్పీటీసీ ఆముల నారాయణ పార్టీ రాష్ట్ర నాయకులు మూల విజయారెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి,పెద్దపల్లి జెడ్పి చైర్మన్ పుట్ట మధూకర్, మేయర్ అనిల్ కుమార్,డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

---

## మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు



కుమ్రంభీం అసిఫాబాద్,ఫిబ్రవరి 20 (మనంన్యూస్): తెలంగాణకు హరితహారం, పట్టణ ప్రగతి కార్యక్రమాలలో భాగంగా పురపాలక సంఘాల పరిధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలలో నాటిన మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని

మిగతా 2లో..

## ప్రతి దరఖాస్తును పరిష్కరించే దిశగా చర్యలు

### జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

కుమ్రంభీం అసిఫాబాద్, ఫిబ్రవరి 20(మనంన్యూస్)ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్ పాయితో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని కైరి గ్రామపంచాయతీలు క్షేత్ర సహాయకులుగా పనిచేస్తున్న గిత్తె తులసీరామ్ తన దరఖాస్తులో సాంకేతిక కారణాల వలన తన పేరు ఎం. సి. సి. లో రాకపోవడంతో ఇక్కడ క్షేత్ర సహాయకుని పోస్టు ఖాళీగా చూపిస్తుందని, ఎం. సి. సి. లో తన పేరు వచ్చేలా చూడాలని కోరారు. కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ చెందిన సునీల్ సన తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని ఆన్లైన్లో నమోదు చేసి తనకు నూతనకు నూతన పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. వాంకిడి మండలం కమానగూడ గ్రామపంచాయతీకి చెందిన గిరిజన రైతులు తాము గత ఏండ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నామని, తాము కాస్తు చేస్తున్నట్లుగా ఆన్లైన్లో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నామని, ఈ విషయమై పరిశీలించి ఆన్లైన్ లో వివరాలు నమోదు చేసి, భూములకు కొలతలు చేయించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన



మండలం పసికం గ్రామానికి చెందిన డోగ్రి శాంతాబాయి నిరుపేద రాలిని అయిన తనకు ప్రభుత్వము భూమిని మంజూరు చేయగా సాగు చేసుకుంటున్నానని, ఇట్టి భూమి వివరాలను ధరణి లో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ (టి) మండలం ఇటిక్యాల పహాడ్ తమ

మిగతా 2లో..

# దళిత బంధు రెండో విడుత నిధులను వెంటనే విడుదల చేయాలి



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 20,(మనం న్యూస్) : బడుగు, బలహీన సంక్షేమం సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకానికి సంబంధించిన రెండో విడుత నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటం వెంకటేష్ కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కమలాపూర్‌లో రెండో విడుత నిధులను మంజూరు చేశారని, హుజూరాబాద్ మండలంలో సైతం రెండో విడుత నిధులు విడుదలయ్యే జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు మోటం రాంచంద్రం, నాయకులు సాంబయ్య, సమ్మయ్య, పెద్దిరెడ్డి సమ్మయ్య, శ్రీనివాస్, సారయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు మొండి చేయ్యి



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 20,(మనం న్యూస్) : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు మొండి చేయ్యి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని తెలిపారు. సీపీఐ సంస్థకు ఈ బడ్జెట్‌లో కేవలం లక్ష రూపాయలు మాత్రమే కేటాయించడం ఏమిటాని ప్రశ్నించారు. పత్తి రైతుల పట్ల బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. పత్తిని నమ్ముకున్న రైతులకు రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఐటీ దాడులు జరపటం ఏమిటాన్నారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల హక్కులను కాలరాస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుండేటి వాసుదేవ్, కదిరి రమేష్, పోతారం అశోక్‌లు ఉన్నారు.

## నూతన టారిఫ్ విధానాన్ని రద్దు చేయాలి



హుజూరాబాద్‌టౌన్,ఫిబ్రవరి 20,(మనం న్యూస్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన టారిఫ్ విధానాన్ని రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్లు కోరారు.సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన టారిఫ్ ఆర్డర్ ద్వారా వినియోగదారులు టీవీ చూడాలంటే భారంగా మారుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం జీవనోపాధి కోసం జీవిస్తున్న కేబుల్ ఆపరేటర్లకు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. బ్రాడ్ కస్టర్‌లకు వ్యతిరేకంగా గత రెండు రోజుల నుంచి చానల్ నిలిపివేశామన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్లు బిఎస్ లతా, మంద మకరంద

జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 20( మనం న్యూస్ ): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు బిఎస్ లత, మంద మకరంద లు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 34 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మాధురి, వినోద్ కుమార్ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.





## ప్రతి దరఖాస్తును పరిష్కరించే దిశగా చర్యలు

మొదటి పేజీ తరువాయి..

గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమం క్రింద పాఠశాల భవనము మంజూరు నిర్మాణము తుది దశలో అటవీ శాఖ అధికారులు అభ్యంతరం తెలిపారని, ఈ విషయమై విచారణ జరిపి తమ గ్రామానికి పాఠశాల అందించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. కాగజ్ నగర్ మండల కేంద్రానికి చెందిన మోతే పోశం వృద్ధుడిని అయిన తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం నజురుల్ నగర్ గ్రామానికి చెందిన కమల మండల్ తన భర్త రైతుబంధు సామూహిక జీవిత పథకంలో చేరి ఇటీవల మరణించారని, తనకు బీమా సొమ్ము మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన కమ్మరి కమల తన పాత పట్టాదారు పాసుపుస్తకం నందు తనకు గల భూమిని నూతన పట్టాదారు పాసుపుస్తకం లో నమోదు చేయలేదని, దీనిని సవరించి ధరణి ఆన్లైన్ లో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామానికి చెందిన సుందరబాయి తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులపై ఎప్పటికప్పుడు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి..

ఆదర్శనగర్ లో గల పట్టణ ప్రకృతి వనంతో పాటు సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామాలను మున్సిపల్ కమిషనర్ అంజయ్య తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రకృతి వనాలలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, సకాలంలో నీటిని అందిస్తూ వాటి ఎదుగుదలకు తోడ్పడాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో కేటాయించిన సెగ్రిగేషన్ షెడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, వీటిలో ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సిగ్రిగేషన్ షెడ్లు కు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో కేటాయించిన వైకుంఠధామాల పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయడంతో పాటు వైకుంఠధామాలలో నీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించి వినియోగించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రమోద్, సానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపల్, రెవెన్యూ శాఖల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి



హుజూరాబాద్‌రూరల్,ఫిబ్రవరి 20,(మనం న్యూస్) : దళిత బంధు పథకాన్ని దళిత బంధు లబ్దిదారులు సంపూర్ణంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన దళిత బంధు లబ్దిదారుల ఫోటో ఆప్ లోడ్, వాహన రిజిస్ట్రేషన్ వివరాలు దళిత బంధు యాప్‌లో నమోదు, అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకం కింద వాహన యూనిట్లను ఎంపిక చేసుకున్న లబ్దిదారులతో యూనిట్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం వాహన రిజిస్ట్రేషన్ గురించి జిల్లా రవాణా శాఖాధికారులు, సిబ్బంది లబ్దిదారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ బండ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా రవాణ శాఖాధికారి చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, ప్రత్యేకాధికారి సురేష్, ఆర్డీవో హరిసింగ్, ఎంపీఐ సిరాజు ఉర్ రహమాన్, క్లస్టర్ అధికారులు రాజ మనోహర్, మధుసూదన్, నేతనియల్ తదితరులు ఉన్నారు.

## హోంగార్డుల కుటుంబాలకు ఆర్థికసహాయం



కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 20( మనం న్యూస్) కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ లో ఈ మధ్యకాలంలో మృతిచెందిన హోంగార్డుల కుటుంబాలకు సోమవారం నాడు పోలీస్ కమీషనర్ ఎల్ సుబ్బరాయుడు ఆర్థికసహాయం అందజేశారు. కేశవపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన తిరుపతి, తుమ్మనపల్లికి చెందిన శంకరయ్య,హుజూరాబాద్ కు చెందిన రాజమౌళి కుటుంబాలకు ఈ ఆర్థికసహాయాన్ని అందజేశారు. కమీషనరేట్ లో పనిచేస్తున్న హోంగార్డులు వ్యక్తిగత భీమా చేయించుకుని కుటుంబాలకు ఆర్థిక తోడ్పాడు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ విభాగం ఆర్ఐ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మా కూతురు ప్రాణాలు కాపాడండి

### నిరుపేద తల్లిదండ్రుల మొర





కరీంనగర్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)ః ఇద్దరు పిల్లలతో కూడిన చిన్న కుటుంబం.. ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న తండ్రి, ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ పిల్లలను ఉన్నత చదువులకు సన్నద్ధం చేస్తోన్న తల్లి... ఇలా వారి జీవితం ఉన్న వనరులతో ఆనందంగా గడుపుతోంది. కాలానికి కన్నుకుట్టిందో ఏమో ఆ కుంటుంబంలోని పెద్ద కూతురు ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి తీవ్ర అనారోగ్యానికి గురైంది. నెలకు ఎనిమిది వేల రూపాయల వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఆ తండ్రి, కూతురు చికిత్స కోసం అక్కడా ఇక్కడా చేసి లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అయినా ఆమె ఆరోగ్యం ఇంకా కుదుటపడకపోగా, రోజుకు 18 వేల రూపాయల వ్యయంతో చికిత్సనందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక, ఏం చేయాలో దిక్కుతోచని ఆ కుటుంబం మనసున్న మారాజులెవరైనా ఆదుకోకపోతారా..? అని ఎదురుచూస్తున్నారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీకి చెందిన మర్రి శ్రీనివాస్ రూప దంపతులకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు శ్రావణి తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గత నెల పదవ తేదీన ఇంట్లోని బాత్ రూంలో కాలు జారి పడ్డ ఆమెకు తలకు దెబ్బతగిలి ఫిట్స్ వచ్చాయి. తక్షణమే నగరంలోని ఆస్పత్రిలో చేర్పించిన కుటుంబ సభ్యులు, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి ఆమెను తరలించారు. ఆమె చికిత్స కోసం తెలిసిన వారి నుంచి బాకీలు తెచ్చి ఇప్పటికే 12 లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. అయినా ఆమె మామూలు మనిషి కాకపోవడంతో 29వ తేదీన నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇప్పుడు ఆ అమ్మాయి వైద్యానికి ప్రతి రోజు 18 వేల రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తోంది. కరీంనగర్‌లో నెలకు ఎనిమిది వేల రూపాయల వేతనంతో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోన్న శ్రీనివాస్‌కు ఆస్పత్రి డబ్బులు చెల్లించే ఆర్థిక స్థోమత లేక, కన్నబిడ్డ పరిస్థితిని చూస్తూ భోరున విలపిస్తున్నాడు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తన కూతురుని ప్రాణాపాయ పరిస్థితుల నుంచి రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సహృదయం కలిగిన మహనీయులు దయ తలిచి బాధితురాలి తల్లి రూప సెల్ నంబర్ 81255 53242 కు గానీ, కలెక్టర్ కాంప్లెక్స్ లోని ఎస్‌బిఐ బ్యాంకు ఐఎఫ్‌ఎస్‌సి నంబరుః ఎస్‌బిఐ0020606 అకౌంటు నంబరు 62024971270కు గానీ సహాయాన్ని అందించి తమ కూతురును ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

### ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్



కరీంనగర్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకున్న నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టడంతో పాటు అధికారుల అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జి. ప్రశాంత్ కుమార్ సోమవారం ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి అభివృద్ధి కోసం కేటాయించిన నిధులతో పాటు కోవిడ్ సమయంలో వచ్చిన నిధులు, మాతా శిశు కేంద్రంలో పెయిరింగ్ రూమ్ కోసం వచ్చిన నిధులను అధికారులు గత 5 సంవత్సరాల నుండి పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులను గత ఐదు సంవత్సరాల నుండి ఖర్చు చేసిన నిధులకు బిల్లులు కూడా లేవని, దీని విషయమై సమాచార హక్కు చట్టం కింద అడిగితే బిల్లులు కూడా ఇవ్వడం లేదని వారు తెలిపారు. ఆసుపత్రి అధికారులు పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చేస్తున్నా పట్టించుకునే వారే లేరని ఆరోపించారు. పెద్ద ఆస్పత్రిలో డీజిల్ పెద్ద కుంభకోణం నడుస్తోందని, ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రోగ్రాం ఆఫీసర్, జనరేటర్‌లకు నెలకు 2 నుంచి 3 లక్షల రూపాయల ఖర్చు అయినట్లు పేర్కొంటూ నిధులను స్వాహా చేస్తున్నారన్నారు. ఉద్యోగ నియామకాల సందర్భంలోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజాప్రతినిధుల సిఫారసుంటే అనర్హులను కూడా విధుల్లో చేర్చుకుంటున్నారని శేఖర్, ప్రశాంత్‌లు ఆరోపించారు. ఈ నియామకాల సందర్భంగా పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కొనసాగుతున్న అవినీతి తంతుపై తక్షణమే విచారణ నిర్వహించి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు వారు హెచ్చరించారు.

## జీఎం నారాయణకు ఘన సన్మానం



గోదావరిఖని, ఫిబ్రవరి 20 (మనం న్యూస్) : 2022-23సంవత్సరంకు గాను నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యాలను 41రోజుల ముందుగానే సాధించినందుకు ఆర్జీ-1ఏరియా జీఎం కె. నారాయణను సోమవారం పలువురు ఘనంగా సన్మానించారు. ఏరియా ఉన్నత అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు, సీఎంఓఐ సంఘం అధికారులు జీఎంని అభినందించి వారిని శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 39.20లక్షల టన్నులు కాగా ఫిబ్రవరి 18న అనుకున్న గడువుకు ముందే 39.24లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 100శాతం ఉత్పత్తి సాధించడం ఆనందకరమైన విషయమని అన్నారు. ఇందులో పాటు పంచుకున్న ప్రతి ఒక్కరిని జీఎం నారాయణ అభినందించారు. అధికారులు, సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు అందరి సమిష్టి కృషితోనే నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను 41రోజుల ముందుగానే సాధించగలిగామని తెలిపారు. ఇదే స్పూర్తితో మనుముందు కూడా రక్షణతో బొగ్గు ఉత్పత్తి చేయాలని, సంస్థ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో టిబిజికెఎస్ ఉపాధ్యక్షులు గండ్ర దామోదర్‌రావు,సిఎంఓఏఐ ప్రెసిడెంట్ పోనోగోటి శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ రామక్రిష్ణ, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజేయప్రసాద్, సర్వే అధికారి ప్రభాకర్, ఎస్టేట్ అధికారి బాలసుబ్రమణ్యం, అడిట్ అధికారి రాజం, పర్చేస్ అధికారి శ్రీనివాస్,జీఎం కమిటి మెంబర్స్ వడ్డెపల్లి శంకర్, పుట్ట రమేష్, జనగామ శ్రీనివాస్, శశగిరి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కార్డులను పునరుద్దరించుకోవాలి



హుజూరాబాద్‌రూరల్,ఫిబ్రవరి 20,(మన ం న్యూస్) : కార్మిక శాఖ ద్వారా లేబర్ కార్డులు పొందిన ప్రతి కార్మికుడు తప్పనిసరిగా గడువులోగా కార్డులను పునరుద్దరించుకోవాలని హుజూరాబాద్ సహాయ కార్మిక శాఖాధికారి డి. చందన అన్నారు. సోమవారం కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లేబర్ కార్డులు పొందిన ప్రతి కార్మికుడు గడువులోగా రెన్యూవల్ చేసుకోవాలని లేని పక్షంలో కార్మిక సంక్షేమ శాఖ ద్వారా లభించే అన్ని రకాల లబ్దికి అనర్హులు అవుతారని తెలిపారు.

## వాహన పన్నులను సకాలంలో చెల్లించాలి



హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 20,(మన ం న్యూస్) : వాణిజ్య వాహనాలకు సంబంధించిన రవాణా పన్నులను సకాలంలో చెల్లించాలని హుజూరాబాద్ ఎంవీఐ సిరాజ్ ఉర్ రహమాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి పన్నుల చెల్లింపు ఉంటుందని తెలిపారు. గడువు లోపు పన్నులను చెల్లించకపోతే అదనంగా 50 శాతం భారం పడుతుందని తెలిపారు. రవాణా పన్ను చెల్లించని సమయంలో తనిఖీల్లో చిక్కితే 200 శాతం జరిమానా విధించి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నిబంధన మేరకు అన్ని పత్రాలు ఉంటేనే రోడ్లపై తిరగాలన్నారు. నిబంధనలను అతిక్రమించి వాహన సామర్థ్య.. వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ, పర్మిట్, రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ ప త్రాలు లేకుండా వాహనాలను నడిపితే వాహనాలకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ సర్వర్‌పాషా, కానిస్టేబుల్ కత్తుల నాగరాజు, హోంగార్డు గుర్రం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20,(మనం న్యూస్) : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేలా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి కోరారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో బీజేపీ మండలాద్యక్షుడు రాముల కుమార్ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇంచార్జీ రాసమల్ల వేణు అద్యక్షతన శక్తి కేంద్రం స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన సాగుతుందని, కుటుంబ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించేందుకు ప్రతి కార్యకర్త సిద్దం కావాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలపై బీజేపీ పార్టీ అలుపెరగని ఉద్యమాలు చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాల గురించి ఉద్యమిస్తే పోలీసులతో వారిని భయపెట్టిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో నేరవేరలేదన్నారు.ఈ సమావేశంలో నాయకులు పారిపెల్లి కొండాల్‌రెడ్డి, చిదురాల శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, ముద్రవేణి గాలయ్య, మంతెన వరదేశ్వర్ తదితరులు ఉన్నారు.

## ట్రాలీ ఆటో బోల్తా కూలీలకు తీవ్ర గాయాలు



ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)ః ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామ సమీపంలో సోమవారం కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తా పడి 15 మంది గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన పలువురిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు.

# బంగారు ధరలు పెరిగి
# విశ్వబ్రాహ్మణుల దుర్భరమైన జీవితం

**ప్రభుత్వం స్వర్ణకారులకు రెండు వేల కోట్లు విడుదల చేయాలి**

**కార్పొరేట్ జువెల్లరీ వ్యవస్థను రద్దుచేయాలి**

**స్వర్ణకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇల్లెందుల కృష్ణమాచారి**



పెద్దపల్లి, ఫిబ్రవరి 20(మనం ప్రతినిధి): బంగారు, వెండి ధరలు పెరిగి పనులు లేక స్వర్ణకారులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెండు వేల కోట్లు విడుదల చేసి, విశ్వబ్రాహ్మణులను తక్షణమే ఆదుకోవాలని స్వర్ణకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇల్లెందుల కృష్ణమాచారి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్షులు కట్ట సదానందం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నుంచి విశ్వబ్రాహ్మణులను రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్పొరేట్ వ్యవస్థను రద్దు చేసి, విశ్వబ్రాహ్మణ స్వర్ణకారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జువెల్లరీ వ్యవస్థ, పెట్టుబడి దారీ వ్యవస్థ ఉన్న స్వర్ణకారులకు పనులు లేక చాలామంది పూట గడవక ఆత్మహత్యలు చేసుకుం టున్నారని, ప్రభుత్వం పేద స్వర్ణకారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లనుమంజూరు చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించి ఆదునాతనమైన పనిముట్లను ఉచితంగా స్వర్ణకార సోదరులకు ఇవ్వాలని , స్వర్ణకార సోదరులు వెండి బంగారు పనిచేయగా ఆసిడ్ ద్వారా కంటి చూపు తగ్గి పోతున్నాయని, 50ఏళ్ల దాటిన స్వర్ణకారులకు పించన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్షులు కట్ట సదానందం ఆధ్వర్యంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర నాయకులు ఇల్లెందుల కృష్ణమాచారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కందుకూరి పూర్ణచారి, మెట్టుపల్లి కార్యదర్శి బాజీ శ్రీనివాస్, కట్ట రాజానందం, దేవరకొండ రాజు, వెంకటేశ్వర్లు, కట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ**



పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఆర్జీలను తక్షణమే పరిశీలన చేసి వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మంది రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌లతో కలిసి ప్రజల నుండి (29) దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయమై సవివర మైన వివరణను సంబంధిత దరఖాస్తుదారులకు తెలపాలని కలెక్టర్ సూచించారు.

## విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక



పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (మనం ప్రతినిధి): మండలంలోని పెద్దబొంకూర్ గ్రామంలో సోమవారం గాయిత్రి విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పుసాల మొండయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏలేశ్వరం సత్యబాపుచారి, ఉపాధ్యక్షులుగా సిరి కొండ చంద్రమొగిలి, కోశాధికారి మడుపు వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిపెల్లి శ్రీనివాసచారి, సలహాదారులుగా మడుపు నాగబూషణా చారి, ఎం.నరేందరచారి, రాజాబాబుచారి, సాగర్‌చారి, కార్యవర్గ సభ్యులు రాంమూర్తి, సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

## సియస్పార్ నిధులను గడువులోపలే వినియోగించుకోవాలి

**రఘుపతి,ఆర్జీ-3 సియస్పార్ కన్వీనర్**



రామగిరి,ఫిబ్రవరి 20 మనం న్యూస్ : సియస్పార్ కొత్త చట్టం ప్రకారం శాంక్షన్ అయిన నిధులను మూడు సంవత్సరాలలోపు ఉపయో గించుకొని పనులను పూర్తిచేసుకోవాలి.లేని ఎడల ఆ నిధులు కేంద్ర ప్రభుత్వానికి బదిలీ అవుతాయి అని తెలిపారు. సోమవారం ఉదయం పెద్దపల్లి జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులు పుట్ట మధుకర్‌ని ఆర్జీ-3 ఎస్ట రఘుపతి ఆధ్వర్యంలోని బృందం కలిసి 2019-20 సంవత్సరంలో శాంక్షన్ అయిన నిధులను మార్చి 31 లోపు ప్రపోజల్ ప్రకారం ఉపయోగించుకోవలసిందిగ సూచించారు.

## తండ్రిని కోల్పోయిన పేదింటి అమ్మాయిలకు

**మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ చేయూత**




కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): తండ్రిని కోల్పోయిన ముగ్గురు పేదింటి అమ్మాయిలకు మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ అనే స్వచ్ఛంధ సంస్థ ఆర్థికంగా చేయూతనిచ్చింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ శేఖర్, అనుపమ కొండేపూడి దంపతుల సహకారంతో తండ్రులను కోల్పోయిన సిరిసిల్లకు చెందిన కూర్మాచలం సాహితీ, గోదావరిఖనికి చెందిన మంతెన లాస్య, కరీంనగర్ కు చెందిన జానంపేట హర్షిణిలకు ఒక్కొక్కరి పేరిట 11వేల116 రూపాయలను తపాల శాఖలో డిపాజిట్ చేశారు. ఈ మేరకు సోమవారం దానికి సంబంధించిన బాండ్, పాసు పుస్తకాలను అమ్మాయిల తల్లులకు అందించారు. ఈ ముగ్గురి కుటుంబాల గురించి చాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులకు వివరించగా అమ్మాయిలకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఫౌండేషన్ తరపున వీరికే కాకుండా గతంలోనూ ఇద్దరు అమ్మాయిలకు కూడా ఆర్థిక సహాయాన్ని అందించడం పట్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రేండ్ల శ్రీనివాస్, ఆయన సతీమణి పద్మ, ఎన్ఆర్ఐ శేఖర్ అనుపమ దంపతులకు చాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నాథం శ్రీనివాస స్వామి, గౌరవ అధ్యక్షుడు జానంపేట మారుతి స్వామిలు ధన్యవాదాలు తెలిపారు.

## కూనంనేని పర్యటనను విజయవంతం చేయాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి**




కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఈ నెల 23వ తేదీన కరీంనగర్‌కు మొట్టమొదటి సారి రానున్న సందర్భంగా ఘనస్వాగతం పలుకడంతో పాటు పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో కరీంనగర్ నగరంలోని సిపిఐ శాఖా కార్యదర్శుల సమావేశం కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఈ నెల 23న కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్ లో నిర్వహించనున్న కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పార్టీ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథులుగా కూనంనేని సాంబశివరావుతోపాటు జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పార్టీ నిర్మాణాన్ని పెంచడంతోపాటు ప్రజాసంఘాలను బలోపేతం చేయడం కోసం రాష్ట్ర కార్యదర్శి దిశ నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపెల్లి రాజు, బీర్ల పద్మ, శాఖా కార్యదర్శులు కిన్నెర మల్లమ్మ, పంజాల శ్రీనివాస్, నలువాల సదానందం, కొట్టే అంజలి, న్యాలపట్ల రాజు, సత్యనారాయణ చారి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులు,చట్టాలపై అవగాహన



మంథని,ఫిబ్రవరి 20 మనం న్యూస్ : మంథని పట్టణంలోని కృష్ణవేణి టాలెంటెడ్ స్కూల్‌ను సోమవారం వినియోగదారుల హక్కుల సంస్థ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొండ శ్రీనివాస్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కపాక సంపత్‌కుమార్ సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు వినియోగదారుల హక్కులు,చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థిని,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్య నిర్మూలనకు కృషి



**- విద్యార్హతకు తగిన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవాలే**

**- ఉపాధి కోసం పరుగులు పెట్టకూడదన్నదే మా ఆలోచన**

**- జెడ్పి చైర్మన్ పుట్ట మధుకర్**

మంథని,ఫిబ్రవరి 20 మనం న్యూస్ : మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ సమస్య నిర్మూలనకు తనవంతు కృషి చేస్తున్నానని బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి,పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని ఎస్ఎల్బీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంథని నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి,పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్,భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని-రాకేష్,మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజలు,జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ మాట్లాడుతూ ఎంతో మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తూ నిరుద్యోగులుగా ఉంటున్నారని ఎంతో మంది తనవద్దకు తల్లిదండ్రులను తీసుకువచ్చి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించాలని కోరడం బాధాకరంగా ఉందన్నారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన యువత తమ విద్యార్హతకు తగిన ఉద్యోగం ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగుల కలలకు సాకారం చేకూర్చాలన్న ఆలోచనతో 52 బహుళజాతి కంపెనీల సహకారంతో పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఆధ్వర్యంలో జాబ్‌మేళను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. గతంలో జాబ్‌మేళా ద్వారా ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సుదూర ప్రాంతాలని ఆ అవకాశాలను వదులుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాబ్ మేళాలో మాత్రం ప్రతి ఒక్కరు తమ విద్యార్హతకు తగిన ఉద్యోగ అవకాశాలను ఆయా కంపెనీలలో ఎంపిక చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రతి ఒక్కరికి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామని ఆయన అన్నారు. ఎంతో యువకులు ఉద్యోగ అవకాశాలు ఉన్నా సుధూర ప్రాంతాలని,వేతనం తక్కువని తమకు వచ్చిన అవకాశాలను చేజార్చుకుంటారని,ఎవరు కూడా అలా చేయకూడదని ఆయన తెలిపారు. ఎక్కడ ఉద్యోగ అవకాశం వచ్చినా ఎంత వేతనం ఉన్నా వదులుకోవద్దన్నారు. ఒకప్పుడు ఉద్యోగాల కోసం పట్టణాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు ఉండేవని అలాంటి పరిస్థితులు ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు రావద్దన్నదే మా ఆలోచన అని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించి వారి కాళ్లపై వాళ్లు నిలబడే విధంగా చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ మట్టిలో పుట్టిన బిడ్డగా ఈ ప్రాంత పేద ప్రజలకు తనవంతు సాయం అందించాలన్నదే తన సంకల్పమని,ఇందులో భాగంగానే అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. పదేళ్ల క్రితమే తనతల్లి పేరున ట్రస్టునే స్థాపించి పేద బడుగు బలహీనవర్గాలకు సేవలు అందిస్తున్నామని అంతేకాకుండా నిరుపేద విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచన చేసి ప్రభుత్వ కళాశాలల్లోని పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతోందన్నారు. అలాగే విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించే దిశగా ప్రతి కళాశాల,మోడల్ స్కూల్‌ల్లో మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని సైతం చేపట్టినట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఎంతోమంది పేద విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. 52 బహుళజాతి కంపెనీ ప్రతినిధులు హాజరవుతున్నారని,విద్యార్హతకు తగిన ఉద్యోగులకు వెంటనే ఎంపిక చేస్తారని,ప్రతి ఒక్కరికి ఈ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేళాలో ఉద్యోగ అవకాశాలు వచ్చిన వారు తమ వేతనం ద్వారా ప్రతి నెల ఒక్క రూపాయి పుట్ట లింగమ్మ ట్రస్టు విరాళంగా ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. భూపాలపల్లి జెడ్పిచైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ మాట్లాడుతూ తాను ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగం కోసం బెంగళూరు వెళ్లామని,ఆనాడు ఉద్యోగాల కోసం ఎంతో కష్టాలు ఎదుర్కొవాల్సి వచ్చేదన్నారు. నిరుద్యోగ యువతీ,యవకులు అందివచ్చే ప్రతి అవకాశాన్ని ప్రతి సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య నిర్మూలించేందుకు జెడ్పి చైర్మన్ పుట్ట మధుకర్ గొప్పగా ఆలోచన చేసి పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయడం అదృష్టంగా భావించాలన్నారు. 52 బహుళజాతి కంపెనీలతో ఏర్పాటు చేసిన ఈ జాబ్‌మేళాలో ప్రతి ఒక్కరు ఉద్యోగ అవకాశాన్ని సాధించుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. నిరుపేద వర్గాల అభ్యున్నతి కోసం గొప్పగా ఆలోచన చేసే నాయకుడు పుట్ట మధు అని,అలాంటి నాయకుడికి ప్రతి ఒక్కరు రుణపడి ఉంటారని అన్నారు.నిరుద్యోగులు ఎవరిపై ఆధారపడకుండా ఉద్యోగ అవకాశం కల్పించి వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలని ఆలోచన చేయడం అభినంద నీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గంలోని టిఆర్ఎస్ మండల నాయకులు,ఎంపీపీలు,జెడ్పిటిసిలు,సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు,గ్రామశాఖ అధ్యక్షుడు, ఎంపీటీసీలు,సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లు,వార్డు మెంబర్లు,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనతో అన్ని గ్రామాల్లో ప్రగతి విప్లవం

### పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



సుల్తానాబాద్,ఫిబ్రవరి 20 మనం న్యూస్ : బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రగతి విప్లవం కొనసాగుతోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాకలో రూ.9.5 లక్షలు,నారాయణపూర్ గ్రామంలో రూ.9లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి,ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు,మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు,యూత్ మండల అధ్యక్షుడు గుడుగుల సతీష్,సర్పంచ్ మూల స్వరూప,మూల హరీష్,బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



సుల్తానాబాద్, ఫిబ్రవరి 20 మనం న్యూస్ : సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఐదు లక్షలతో నూతనంగా నిర్మాణం చేయనున్న యాదవ సంఘం భవనానికి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఐదు లక్షల నిధులు కేటాయించినందుకు గాను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిని ఎంపీపీ బాలాజీ రావును గ్రామ యాదవ సంఘం అధ్యక్షులు ఆర్.మల్లయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా కన్వీనర్ కాసర్ల అనంతరెడ్డి,ఎంపీపీ బాలాజీరావు, భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు పురం ప్రేమ్ చందర్‌రావు, సర్పంచ్ మూల స్వరూప,మాజీ సర్పంచ్ గుడుగుల అపర్ణ సతీష్,గ్రామశాఖ అధ్యక్షులు ఎర్రవెల్లి వేణుగోపాలరావు,కొదురుపాక సర్పంచ్ సాగర్‌రావు,మాజీ సర్పంచ్ అన్నమనేని రఘుపతి రావు,భారత రాష్ట్ర సమితి యువనేత మూల హరీష్,మండల సదానందం, కొమ్మ సదానందం,బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పెళ్లిరోజు సందర్భంగా దివ్యాంగులకు

## అన్నదానం చేసిన దంపతులు



సుల్తానాబాద్, ఫిబ్రవరి 20 మనం న్యూస్ : సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునర్వాస కేంద్రంలో పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్తలు రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు అల్లం భాగలక్ష్మీ-సత్యనారాయణ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా పట్టణంలోని మానసిక వికాలంగుల కేంద్రంలో గల దివ్యాంగులు చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులు మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా సుల్తానాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆపదలో ఉన్న వ్యక్తికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. మా పెళ్లి రోజు చిన్నారుల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ రాజ్‌కుమార్,ఏపీవో శ్రీనివాస్,కంప్యూటర్ ఆపరేటర్ ధర్మేందర్,సెంటర్ ఇన్చార్జి శ్రీనివాస్‌గౌడ్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరి గాంధీ పాఠశాలలో బుక్స్ పంపిణీ



కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 20 మనం న్యూస్ : కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాటశాల చదువుతున్న పదవతరగతి విద్యార్థులకు 15వేల రూపాయల విలువగల బుక్స్ ,పరీక్ష ప్యాడ్స్,పెన్స్,మొట్లపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త జంగా ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ అనుపమ వ్యాపారవేత్త జంగ ప్రభాకర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు బుక్స్,పరీక్ష ప్యాడ్స్,పెన్నులను అందజేశారు. అనంతరం జంగ ప్రభాకర్ రెడ్డిని,తహసీల్దార్ అనుపమను విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని,విద్యకు పేదరికం అడ్డుకాదని ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొని,గొప్ప ప్రయోజకులు కావాలని, తన వంతు సాయం ఎప్పుడు ఉంటుంది అని అన్నారు. ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మార్వో అనుపమ,విద్యార్థిని,విద్యార్థులు స్కూల్ యాజమాన్యం శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి,ఆర్ఐ ఉదయ్ శ్రీ,దాసరి విష్ణు, ఉపాధ్యాయులు శోభ,సంధ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు,తదితరులు ఉన్నారు.

## రుణమాఫీని వెంటనే చేయాలి



వీణవంక-ఫిబ్రవరి 20 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రప్రభుత్వం 90వేల లోపు బ్యాంకు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తామని గతఅసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్‌రావు స్పష్టం చేసినప్పటికి ఇంత వరకు అమలు కావడంలేదని మండలంలోని కిష్టంపేట గ్రామ బిజేపి నాయకులు డాక్టర్ దాసరి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఉగాది లోపు రైతులకు రుణ మాఫీ చేస్తామని అప్పుడు హరీష్‌రావు ప్రకటించినా ఇప్పటి వరకు పైసా కూడా రుణమాఫీ కాలేదని అన్నారు. రైతులు వేసిన యాసంగి పంట చీడపీడల బారిన పడి ఆర్థికంగా పంటనష్ట పోతున్నారని ఇప్పటికైనా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రుణమాఫీ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.అలాగే పీఎం కిసాన్ యోజన, రైతుబంధు ల కింద రైతులకు ప్రతి సంవత్సరం పంట సాగు ఆర్థిక సహాయాన్ని బ్యాంకులు బాకి కింద జమ చేసుకుంటున్నారని ఆవేధన వ్యక్తం చేశారు.ఇలాంటి బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## డిఇఐసిను త్వరగా అందుబాటులోకి తేవాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20, (మనం న్యూస్): డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం వేములవాడలోని ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటుచేసిన డిస్టిక్ ఎర్లీ ఇన్వెన్షన్స్ సెంటర్ ను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నవజాత శిశువులు, శిశువుల్లో శారీరక, నరాల సంబంధిత వైకల్యాలను నివారించడానికి, తగ్గించడానికి డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ దోహదం చేస్తుందన్నారు. స్టాఫ్ రిక్రూట్ మెంట్ సహా పెండింగ్ పనులను పూర్తి చేసి డిస్టిక్ ఎర్లీ ఇన్వెన్షన్స్ సెంటర్‌ను ప్రజలకు సాధ్యమైనంత త్వరగా వినియోగం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపిపి శ్రీలత



కొత్తపల్లి, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)፡ కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో 70 లక్షల రూపాయల ఈజీఎస్ నిధులతో మంజూరైన సిసి రోడ్డు పనులను సోమవారం ఎంపిపి పిల్లి శ్రీలత మహేష్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ కరీంనగర్ నియోజక వర్గం అభివృద్ధికి కృషి చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సిసి రోడ్లు, తారు రోడ్లు మంజూరు చేయిస్తోన్న మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందంజలో ఉంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, జడ్పిటిసి సభ్యులు పిట్టల కరుణా రవీందర్, ఎంపిడివో శ్రీనివాసరెడ్డి, ఎఎంసి చైర్మన్ రెడ్డవేణి మధు, సర్పంచ్ గొట్ట జ్యోతి పోచయ్య, ఎంపిటిసి సభ్యులు పండుగ గంగవ్వ నర్సయ్య, ఏఈ రమణారెడ్డి, కొత్తపల్లి మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ కాసారపు గణేష్, వార్డ్ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, జనార్దన్, శ్రీనివాస్, సంపత్, మాజీ ఎంపిటిసి సభ్యులు ఒల్లాల మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు గ్రామపంచాయతీ గ్రీన్ సిగ్నల్



ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)፡ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్ర హ ఏర్పాటుకు గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది సోమవారం గ్రామపంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో విగ్రహ ఏర్పాటుకు అనుమతినిస్తూ తీర్మాణించారు. కొత్త బస్టాండు ఎదురుగా కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ ను తొలగించి, ఆ ప్రదేశంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పాలకవర్గం సూచించింది.

# ఆకలి చావులు,ఆత్మహత్యలులేని రాష్ట్రమే కేసీఆర్ లక్ష్యం

### సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌వన్

### రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఆకలి చావులు, ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, మైనా ర్టీ సంక్షేమశాఖ మంత్రి కొ ప్పుల ఈశ్వర్ అన్నారు. సో మవారం రామగుండం కా ర్పొరేషన్ పరిధిలోని 8వ డివి జన్‌లో ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌లతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి, సం





క్షేమం కోసం నిరంతరంగా శ్రమిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే పట్టణ ప్రగతి నిధులను ఏర్పాటు చేసి, పట్టణాలను విస్తృతంగా అభివృద్ధి పరుస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హాయంలో నిధులను కేటాయించకుండా పట్టణాలు దుర్భర పరిస్థితులు ఎదుర్కోన్నాయన్నారు. కేసీఆర్ ప్రత్యేక దృష్టితోనే తెలంగాణ ప్రాంతం అభివృద్ధి పథంలో ఎటువంట దూసుకుపోతుందన్నారు. పట్టణ ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండడానికి పట్టణ ప్రగతి నిధులకు ప్రతినెల కోటి రూపాయలను కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు సుమారుగా 35కోట్ల ద్వారా అభివృద్ధి పనులు జరిగాయని, అదేవిధంగా వివిధ నిదుల ద్వారా కూడా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రామగుండం ప్రాంతంలో కాలుష్యం ఎక్కువగా ఉందని, స్థానిక పరిశ్రమలు చొరవ తీసుకొని మొక్కలను విరివిగా నాటాలని సూచించారు. పర్యావరనంపై స్థానిక సింగరేణి, ఎన్టిపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ తదితర సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

## కరీంనగర్‌లో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర



కరీంనగర్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)፡ నగరంలో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర కొనసాగుతోంది. రాంనగర్, సంతోష్ నగర్, శ్రీహరి నగర్ కాలనీల్లో డివిజన్ ఇంచార్జి మేకల నర్సయ్య ఆధ్వర్యంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలిసి సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు తెలుసుకుంటూ రాహుల్ గాంధీ సందేశం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై చార్జిషీట్ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక లేకుండా నిధులు వెచ్చించడంలో అర్థం లేదని పేర్కొన్నారు. పిటిసి నుండి వచ్చే వరదనీరు బయటకు వెళ్ళకుండా ఖాళీ ప్రదేశాల్లో నిలిచిపోవడంవల్ల దోమలతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన వృద్దులు దరఖాస్తు పెట్టుకొని ఆసరా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. బిజెపి కార్పొరేటర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న డివిజన్లలో కూడా పార్లమెంట్ సభ్యులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మురికి కాలువలు ఎక్కడికక్కడ నిండిపోయి ఉన్నాయని సిబ్బంది కొరతతో నగరమంతా ఇదే పరిస్థితి ఉందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం విలాస్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ నాయక్,రంగు మల్లేశం,దండి రవీందర్, దన్న సింగ్, సలీమొద్దిన్,మామిడి సత్యనారాయణ రెడ్డి, ఎం డి చాంద్, పోరండ్ల రమేష్,షబానా మహమ్మద్, ఉరడి లత,జిలకర రమేష్, మెతుకు కాంతయ్య,శేహెన్షా, నదిమ్, ముల్కల కవిత,ఎగ్గడి శారద, కీర్తి కుమార్,హనీఫ్,అష్రాఫ్, సోహెల్, రంగు శ్రీనివాస్, పెరుక రాజేందర్, గంధం నాగరాజు, గట్టు వెంకట స్వామి, బొమ్మెన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు దొంగల అరెస్టు

### ఎనిమిది మోటారు సైకిళ్లు స్వాధీనం



కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)፡ జల్సా లకు బానిసై దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకుని మోటార్ సైకిల్ లను అపహరి స్తూ సొమ్ము చేసుకుంటుండడంతో పాటు తాళం వేసిన ఇండ్లను లక్ష్యం గా చేసుకొని దొంగత నాలకు పాల్పడుతున్న ఇద్దరిని సోమవారం కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి దాదాపు నాలుగు లక్షల రూపాయల విలువైన ఎనిమిది మోటార్ సైకిళ్లతో స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ ఎసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డిసిపి శ్రీనివాస్ దొంగల వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. వెదురుగట్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీకాంత్, కరీంనగర్‌లోని ఒక హోటల్లో పని చేస్తూ ప్రస్తుతం మకాంను హైదరాబాదుకు మార్చాడు. ఈ క్రమంలో కరీంనగర్ బస్టాండ్ పరిసర ప్రాంతాలు, షాపింగ్ ఏరియాల్లో పార్కు చేసి ఉన్న మోటార్ సైకిళ్లను దొంగిలించి అమ్ముకొని ఆ వచ్చిన సొత్తుతో జల్సాలు చేసుకుంటూ ఉండేవాడు. మరొక కేసులో నిందితుడు యాకూబ్ పాషా హనుమకొండలో నివసిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నాడు. ఇతనిపై గతంలో పలు దొంగతనం కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చాడు. కోతి రాంపూర్ లోని ఒక కిరాణం షాపులో దొంగతనం చేసిన యాకూబ్ పాషా సుమారు 40 వేల రూపాయలు విలువైన వస్తువులను దొంగిలించాడు. ఇద్దరు దొంగల కదిలికలను సిసి కెమెరాల ద్వారా గుర్తించి వారి పై నిఘా వేసిన కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు వారిని పట్టుకుని వారి వద్ద నుండి సుమారు నాలుగు లక్షల విలువైన ఎనిమిది బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగలను పట్టుకోవడంలో నిరంతరం శ్రమించిన కరీంనగర్ వన్ టౌన్ క్రైమ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ హాసన్, కానిస్టేబుల్ బషీర్, ఇన్స్‌పెక్టర్ నటేశ్ లను డిసిపి శ్రీనివాస్ అభినందించారు.

## రేకుర్తి భూ కబ్జాదారులపై చర్యలు చేపట్టాలి

### బిజెపి సీనియర్ నాయకులు మారుతి



కొత్తపల్లి, ఫిబ్రవరి 20 (మనం న్యూస్)፡ కొత్తపల్లి మండలం రేకుర్తి శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 137 లో భూ కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని బిజెపి సీనియర్ నాయకులు దుర్గం మారుతి సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి బేస్మెంట్ నిర్మాణాలు చేశారని, వీటి ఆధారంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను తప్పుదోవ పట్టించి ఇంటి నెంబర్లు తీసుకొని మోసపూరితంగా ఇతరులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అక్రమ బేస్మెంట్ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు ఇంటి నెంబర్ ఇవ్వకుండా ఆదేశాలు ఇవ్వాలనీ, భూ ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

# వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులుండవు

## కరీంనగర్ మేయర్ సునీల్ రావు



కరీంనగర్, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు తీసుకుం టుందని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. నగర ప్రజలకు ప్రతి రోజు సమయపాలన ప్రకారం తాగునీటినిఅందిస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ కోర్టు రిజర్వాయర్ వద్ద సోమవారం నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలు, వాటి నివారణ చర్యలు, ప్రజలకు అంతరాయం లేకుండ నీటి సరఫరా, ఫిల్టర్ బెడ్, ఎంబిఆర్ ఫిల్లింగ్ సమస్యలు, వాల్స్, పైపులైన్ లీకేజీ సమస్యలు, సమ్మర్ ఆక్షన్ ప్లాన్ తదితర అంశాలపై కమిషనర్ సేవా ఇస్లావత్, ఇంజనీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ ప్రతి రోజు తాగునీటి సరఫరాలో తీసుకునే జాగ్రత్తలు, చర్యలపై సలహాలు, సూచనలు చేస్తూ మేయర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగర ప్రజలకు గత 2 సంవత్సరాల నుండి ప్రతి రోజు మంచి నీటిని సమయానుగుణంగా అందిస్తూ సరఫరా లో ఎక్కడ ఇబ్బందులు రాకుండా నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. నగర వ్యాప్తంగా డైలీ వాటర్ సప్లైని విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఎక్కడ సరఫరా లో ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపడుతూ నీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. చిన్న చిన్న సాంకేతిక సమస్యలు తలెత్తినా వాటిని వెంటనే పరిష్కరించి ప్రజలకు తాగు నీరు అందిస్తామన్నారు. సమ్మర్ ఆక్షన్ ప్లాన్ పూర్తి స్థాయిలో అమలు చేస్తూ ముందస్తు చర్యలతో ప్రజలకు తాగు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. లోలెవల్, హైలెవల్ నీటి సరఫరా పై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేస్తూ తీసుకోవాల్సిన ముందస్తు చర్యల పై ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ అధికారులకు మంచి నీటి సరఫరా లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి సరఫరాలో తలెత్తే సమస్యల సమాచారం కోసం రిజర్వాయర్ వారిగా వాట్సాప్ గ్రూప్ ను అధికారులు రూపొందించి, సంబందిత డివిజన్ల కార్పొరేటర్లు, మేయర్, కమిషనర్ నంబర్లను గ్రూపులో పొందు పరచాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన గ్రూప్ లో పోస్టు చేసి సమాచారం తెలుపాలన్నారు. ప్రధానంగా అంభేద్కర్ నగర్ రిజర్వాయర్ పరిధిలో మాత్రమే గత కొద్ది రోజులుగా చిన్న చిన్న మోటార్, ఇతర టెక్నికల్ సమస్యలు తలెత్తున్నాయని, నగర వ్యాప్తంగా అన్ని రిజర్వాయర్లలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ లో సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన మోటార్ పంపును కోసం టెండర్ పూర్తి చేశామని త్వరలోనే మోటారు పంపు బిగించే సమస్యలు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఫిల్టర్‌బెడ్‌లో కూడా ఆక్షన్ ప్లాన్ లో బాగంగా స్టాండ్ బై మోటారు పంపులు, విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు జనరేటర్లను ఏర్పాటు చేసి సరఫరా చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అధికారులు సమస్యను పెండింగ్ లో పెట్టకుండ త్వరగా పరిష్కరించేలా విధులు నిర్వహించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈఈ లు కిష్టప్ప, మహేందర్, డీఈలు మసూద్ అలీ, వేంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, ఏఈలు, వర్కు ఇన్ స్పెక్టర్లు, లైన్ మెన్ లు పాల్గొన్నారు.



## మల్కాపూర్‌లో బిజెపి స్ట్రీట్ కార్నర్ సమావేశం

కొత్తపల్లి, ఫిబ్రవరి 20 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో బిజెపి బూత్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా స్ట్రీట్ కార్నర్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ జాడి బాలారెడ్డి హాజరై కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్ట్రీట్ కార్నర్ సమావేశాల ద్వారా దేశ ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి పథకాలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్ వైఫల్యాలను ప్రజల్లో వివరించాలన్నారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత యువకులకు, మహిళలకు, రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా కెసిఆర్ నెరవేర్చలేదన్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు లక్ష్మీపూర్ చౌరస్తాలో జరగనున్న స్ట్రీట్ కార్నర్ సమావేశానికి గ్రామస్తులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కొత్తపల్లి మండల రూరల్ అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో స్టాఫ్ రిపోర్టర్లు & రిపోర్టర్లు గా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగు భాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాలలో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు మరియు రిపోర్టర్లు కావలెను.
అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
ఇ.నెం. 1-6-169, మమత థియేటర్ ప్రక్కన,
కలెక్టరేట్ రోడ్, భగత్‌నగర్, కరీంనగర్.

పూర్తి వివరాలకు సంప్రదించగలరు
కె. తిరుపతి రెడ్డి
సెల్ : 83339 98076